క్లుప్తంగా

బీసీ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు



క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లోని ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో శనివారం దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు సత్తెనపల్లి రూరల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని, వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కిటికీలకు మెష్‌లు ఉపయోగించుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, శివుడు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ

క్రోసూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు మండల కేంద్రమైన క్రోసూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 వరకు జరుగు కార్యక్రమాల్లో పుస్తకాలు చదవటం, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జి లాంటి వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలు తప్పక సద్వినియోగపరచుకోవాలని ఆమె కోరారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతువులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆదివారం అమావాస్య రావడంతో దోషాల నివారణకు ప్రత్యేకమైన రోజుగా భావించిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దోష నివారణకు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అమ్మవారి ప్రీతికై చండీపారాయణం చేశారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. విశేష పూజాదికాల అనంతరం ప్రధాన ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వరిగడ్డి వాములు దహనం



మాచవరం: మండలంలోని మల్లవోలు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డి వాములు తగలబెట్టిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ చుక్కా సువార్త, ఆమె కుమారుడు రాజారావు పశువులకు మేత నిమిత్తం 8 ఎకరాల వరిగడ్డిని కొనుగోలు చేసి వాములు వేశారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాములకు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేనుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రక్కనే ఉన్న ఎరువు దిబ్బలు కూడా తగలబడి పోయాయి. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వినియోగించరు.. పడేయరు

- లక్ష్యం నెరవేరకుండానే పాడుబడిన ప్రభుత్వ భవనాలు
- లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు వృధా
- శిథిలమయిన భవనాల్లో గబ్బిలాలు నివాసం
- దుర్వాసన వస్తోందంటున్న స్థానికులు



పాడుబడిన సబ్ ట్రెజరీ భవనం

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తేవాలన్న ఆలోచనతో అన్ని సదుపాయాలుండాలన్న లక్ష్యంతో కొన్ని ప్రభుత్వ భవనాలను నిర్మించారు. భవనాలైతే నిర్మించారు గానీ లక్ష్యానికనుగుణంగా కార్యాచరణలో పెట్టలేకపోయారు. దీంతో లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలు పాడుబడిపోతున్నాయి. ఆ భవనాలను వేరే అవసరాలకు వినియోగించలేకపోవడం దురదృష్టకరం. మండల కేంద్రంలో సుమారు 30 సంవత్సరాల క్రితం మండల రెవెన్యూ, మండల పరిషత్, సబ్ ట్రెజరీ, సివిల్ సప్లయస్ గోడౌన్‌లకు శాశ్వత భవనాలు నిర్మించారు. ఇవి కాక జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో చిన్న తరహా పరిశ్రమలపై యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఒక భవనం, హైస్కూలు స్థాయిలోనే వృత్తి విద్యలను ప్రోత్సహించేందుకు మరో భవనం నిర్మించారు. వీటి నిర్మాణాలకు లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించారు.

సబ్ ట్రెజరీ కార్యాలయం

స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద 1987లో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన సబ్ ట్రెజరీ కార్యాలయం ఏనాడు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. అసలు భవనాన్నే ప్రారంభించలేదు. ఇప్పటికీ సబ్ ట్రెజరీ కార్యకలాపాలే రూపకల్పన జరగలేదు. వాటికి నోచుకోకుండానే ఆ భవనం పాడుబడి, శిథిలమైపోయింది. విద్యుత్ వైర్లతో సహా దొంగిలించుకపోయారు. ప్రస్తుతం భవనం ఆకారమే మిగిలి ఉంది.

జిల్లా పరిశ్రమల కేంద్ర శిక్షణ కేంద్ర భవనం

నిరుద్యోగ యువతీ యువకులకు చిన్న తరహా పరిశ్రమలపై అవగాన కల్పించేందుకు, శిక్షణనిచ్చేందుకు సుమారు 20 ఏళ్ల క్రితం స్థానిక పశు వైద్యశాల వెనుకభాగాన ఉన్న ప్రభుత్వ స్థలంలో జిల్లా పరిశ్రమల శిక్షణ కేంద్ర భవనాన్ని దానికి ఎదురుగానే వర్క్ షాప్ నిర్వహించేందుకు మరో షెడ్‌ను నిర్మించారు.

కాని వీటిని ఏనాడు నిరుద్యోగుల కోసం వినియోగించలేదు. భవనాలు మాత్రము శిథిలమై పాడుబడ్డాయి, ఇందులో కొన్ని రోజులు అసాంఘిక కార్యకలాపాలు కూడా జరిగాయి. ఇప్పుడు ఆ భవనాలలో యాచకులు తలదాచుకుంటున్నారు.

వృత్తి విద్యా శిక్షణ కేంద్రం

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో వృత్తి విద్యపై విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు 1994లో ఒక భవనాన్ని నిర్మించారు. ఇంతవరకు హైస్కూలుకు వృత్తి విద్యా కోర్సేరాలేదు. రూ.6 కోట్లతో నిర్మించిన రెండంతస్థుల భవనం మాత్రం శిథిలమైపోయింది. కొన్ని రోజులు ఇందులో కస్తూర్బా బాలికల పాఠశాలను నడిపారు. ఆ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించి అక్కడకు తరలించడంతో ఈ భవనాన్ని పాడుబెట్టారు. ప్రస్తుతం ఈ భవనంలో గబ్బిలాలు నివాసముంటున్నాయి. ఈ భవనం వెనుకనే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మరో భవనం నిర్మించారు. పాడుబడిన భవనాన్ని మాత్రం అలానే వదిలేశారు. వినియోగించరు, పడేయరు, అలంకారప్రాయంగా కాలేజీ ముందు దిష్టిబొమ్మలా ఈ పాడుబడిన భవనం ఉంది.



శిథిలమై పోయిన వృత్తి విద్యా కేంద్ర భవనం

నెరవేరని లక్ష్యం

ఏ లక్ష్యంతో అయితే లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వ భవనాలు నిర్మించారో, ఆ లక్ష్యం నెరవేరకుండానే కనీసం ఒక్క రోజు కూడా అందుకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించకుండానే భవనాలను పాడుబెట్టారు. వీటికి కేటాయించిన ప్రభుత్వ స్థలాలు కూడా ఇప్పుడు లక్షల రూపాయల విలువ చేస్తాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజల అవసరాలకు ఏదో విధంగా వినియోగించవచ్చు.

సివిల్ సప్లయిస్ గోడౌన్



పిచ్చి మొక్కలతో సివిల్ సప్లయస్ గోడౌన్

సబ్ ట్రెజరీ కార్యాలయం పక్కనే సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్‌కు ఒక భవనాన్ని నిర్మించారు. కొన్ని రోజులు ఈ భవనాన్ని స్టాక్ పాయింట్‌గా వినియోగించారు. ఇక్కడ ఉన్న స్టాక్ పాయింట్‌ను క్రోసూరుకు మార్చడంతో ఈ భవనాన్ని పాడుబెట్టారు. ప్రస్తుతం ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పాడుబడి, శిథిలమైపోయింది.

ట్రావెలర్స్ బంగ్లా



బ్రిటీష్ కాలంలో నిర్మించిన ట్రావెలర్స్ బంగ్లా

స్థానిక హైస్కూలుకు ఎదురుగానే బ్రిటీష్ కాలంలో నిర్మించిన ట్రావెలర్స్ బంగ్లా ఏనాడో శిథిలమై గబ్బిలాలకు నిలయంగా, దుర్వాసన వెదజల్లుతూ ఉంది. అయితే ఈ భవనాన్ని అలానే ఉంచి దాని పక్కనే రూ.40 లక్షల వ్యయంతో మరో అతిథి గృహాన్ని నిర్మించారు. నుతనంగా నిర్మించిన భవనంలోనే అతిథి గృహాన్ని నడుపుతున్నారు గానీ పాతభవనం ఊసు ఎత్తడం లేదు. ఈ భవనాన్ని పూర్వకాలం నాటి రంగూన్ టేకు దూలాలు వినియోగించారు. ఇప్పటికీ ఆ దూలాలు పటిష్ఠంగా ఉన్నాయి. శిథిలమైపోయిన భవనాన్ని తొలగించి వచ్చిన కలపను విక్రయించినట్లయితే ప్రభుత్వ ఖజానాకు కొన్ని లక్షల ఆదాయం సమకూర్చి పెట్టవచ్చు.

శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డాక్టర్ గజ్జల



సత్తెనపల్లి: మండల పరిధిలోని కందులవారి పాలెం గ్రామంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ, పోలేరమ్మ తల్లి కొలుపుల కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ, పోలేరమ్మ తల్లి కొలుపుల కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సలహా మండలి మాజీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ బూతుకూరి వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు

నూజెండ్ల: మండల పరిధిలో ప్రైవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశానికి నేటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యాహక్కు చట్టం ప్రకారం స్థానిక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు కేటాయించాలన్నారు. ఇందులో 10 శాతం ఎస్సీ, 4 శాతం ఎస్టీ, హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు 5 శాతం, బలహీన, మైనార్టీ వర్గాలకు 6 శాతం రిజర్వేషన్ కల్పించబడుతుందన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ, రేషన్‌కార్డ్, పాస్ పోర్టు సైజ్ ఫొటోతో సచివాలయంలోగానీ, మండల విద్యా శాఖ కార్యాలయంలో గానీ మే 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి జాతర



వసంతోత్సవంలో యువత, ప్రజలు



అమ్మవారికి బోనాలను సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో ఆదివారం పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయాన్నే గ్రామస్తులంతా అమ్మవారికి జలాభిషేకాలను నిర్వహించి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. గ్రామస్తులు అమ్మవారి వసంతోత్సవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కుంకుమ బండ్లను కట్టుకొని అమ్మవారికి పసుపు, కుంకుమ, సారెలను సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి పొంగళ్లను చేసుకుని, మహిళలు బోనాలను ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యాలను చెల్లించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై డి.ప్రవీణ్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా తెల్లవారు జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పొంగళ్లు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో భాగంగా విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నార్నెపాడులోని పోలేరమ్మ అమ్మవారు



క్రోసూరులోని అంకమ్మ తల్లి

ఘనంగా అంకమ్మ తల్లి తిరునాళ్ల

క్రోసూరు: క్రోసూరు కొండ కింద బజారులోని అంకమ్మతల్లి 27వ వార్షిక మహోత్సవం (తిరునాళ్ల) శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. పొంగళ్లు పెట్టుకుని నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం భక్తులను అలరింపజేసేందుకు భారీ లైటింగ్‌తో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. కోలాటం నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం



కవి కమలారామ్

వినుకొండ: శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో మే 10, 11 తేదీల్లో ఏలూరులో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు, సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, జాషువా సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షుడు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్ ఆహ్వానం అందుకున్నారు. ఈ సందర్భంగా కమలారామ్‌ను పట్టణ ప్రముఖులు, కవులు అభినందించారు.

యడ్లపాడులో వైద్యశిబిరం

యడ్లపాడు: ఆహార అలవాట్ల మార్పుతో షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచగలమని ప్రముఖ వైద్యుడు లింగమల్లు మోహన్ భాస్కర్ చెప్పారు. బాసట సామాజిక, సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో లింగమల్లు మోహన్ భాస్కర్, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ 230 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. బాసట సభ్యులు కాళిదాసు, శ్రీనివాస్, రామబ్రహ్మం, రవీంద్ర, వేణుగోపాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్యసిద్ది ఆంజనేయస్వామికి పూజలు



కార్యసిద్ది ఆంజనేయస్వామి



అభిషేకానికి బిందెలతో నీటిని తీసుకువస్తున్న మహిళలు

సత్తెనపల్లి: పట్టణంలోని నాగన్నకుంటలో వేంచేసియున్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవం అంకురార్పణ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు నిత్యం విశేష పూజలను వేదాంతం రమణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మొదటి రోజైనా ఆదివారం అమావాస్య పుణ్య తిథిన కార్యసిద్ధి ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి 108 బిందెలతో అభిషేకార్చన గావించారు. ఈ అభిషేకార్చనకు అవసరమైన నీటిని మహిళలు తీసుకువచ్చి అభిషేకార్చనలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటలకు వరకు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఉగ్రదాడి

రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు

నాదెండ్ల: దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే కశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేసి అమాయకులను హతమార్చారని, ఉగ్ర దాడిలో అసువులు బాసిన పర్యాటకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు పేర్కొన్నారు. సాతులూరు ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిఘా, భద్రతా వైఫల్యాల కారణంగానే అమాయక పర్యాటకులు ఉగ్ర దాడిలో చనిపోయారన్నారు. మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. సమాజాన్ని విభజించటం, మతాల మధ్య సమస్యలు సృష్టించటం ఉగ్రవాదుల లక్ష్యమన్నారు. ఉగ్రవాదంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు. కష్టకాలంలో దేశానికి ప్రతి పౌరుడూ అండగా నిలుస్తారన్నారు. దళిత క్రిస్టియన్లు, ఇతర మైనార్టీ వర్గాలపై జరుగుతున్న అమానుష దాడులను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వి.శేషులు, లాజర్, పురుషోత్తం, టి.కిరణ్, వి.చంటి, బాబు ఉన్నారు.

అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

అమరావతి: అమరావతి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. దాత కబశాయి ఝాన్సీ టోర్నమెంట్‌ను ప్రారంభించి మ్యాచ్‌లో పాల్గొనే అమరావతి గోల్డెన్ ఈగల్స్, దిడుగు అంబేడ్కర్ లెవన్ క్రికెట్ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు పులి నాగేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి ప్రీమియర లీగ్ క్రికెట్ పోటీలు వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌లో బోయపాటి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ప్రథమ బహుమతి రూ.40,000, ద్వితీయ బహుమతి కబశాయి అశోక్‌కుమార్ జ్ఞాపకార్థం రూ.30,000, తృతీయ బహుమతి పులిపాటి లక్ష్మీనరసమ్మ, నరసింహారావుల జాపకార్థం రూ.20,000 అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ కీపర్, బెస్ట్ ఫీల్డర్‌లకు బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మితి మీరితే.. ప్రమాదమే..!



అంచులు భద్రత లేకుండా అధిక కూలీలతో వెళుతున్న టాటా మ్యాజిక్

పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా కాలచక్ర రోడ్డు, గ్రామాలకు వెళ్లే అనుసంధాన రోడ్లపై ఆటోల్లో 15 మందికి పైగా, టాటా మ్యాజిక్‌లో 25 నుంచి 30 మంది వరకు ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణిస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల్లో చిన్న పిల్లలు, మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. కనీసం కూర్చోవడానికి కూడా వీలు లేకుండా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. మరో వైపు రహదారుల అంచులు భద్రత లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందే మేల్కొంటే మంచిదని పలువురు వాపోతున్నారు.

– పెదకూరపాడు



కాలచక్ర రహదారిపై అధిక లోడుతో ప్రయాణిస్తున్న టాటా మ్యాజిక్

రోడ్లపై పశువుల సంచారంతో ప్రమాదాలు



పశువులను వాటి యజమానులు రోడ్లపై వదిలేస్తుండటం.. వాహనదారులకు, దుకాణదారులకు సమస్యగా మారింది. పెదకూరపాడులోని రహదారులలో రోడ్డుపై అడ్డంగా తిరుగుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కచేరీ రహదారి వద్ద పశువులు రోడ్డుపైనే సంచరిస్తూ ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. కొన్ని పశువులు దుకాణాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. సంబంధిత అధికారులు అయా పశువుల యజమానులను పిలిచి రహదారులపై పశువులను వదిలివేయకుండా అవగాహన కల్పించాలని వాహనదారులు, దుకాణదారులు కోరుతున్నారు.

– పెదకూరపాడు

గిరిజన హక్కుల కోసం పోరాటం



మాచర్ల: గిరిజన హక్కుల కోసం పోరాటం చేయాలని గిరిజన ప్రజా సమైఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ కోరారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో వైభవ్ ఫంక్షన్ హాలులో గిరిజన ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. అయన గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు మాచర్ల నుంచి ఆత్మీయ సమావేశంతో పోరాటానికి పునాది వేశామన్నారు. సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఐటీడీఏ కార్యాలయాలు పేరుకే పరిమితమయ్యాయని చెప్పారు. మైదాన ప్రాంతంలో 30లక్షల మంది గిరిజనులు ఉంటే ఒక్క నియోజకవర్గం గిరిజనులకు ప్రాతినిథ్యం లేదని వాపోయారు. అన్ని ప్రాంతాలలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర గిరిజన నాయకులు మండ్లి పెద్ద మల్లుస్వామి, నూనావత్ రంగానాయక్, అంజినాయక్ మాట్లాడుతూ గిరిజన వాటాల కోసం అడిగే పరిస్థితిలో ఉన్నామన్నారు. ఆత్మీయ సమావేశంలో జిల్లా గిరిజన సంఘ నాయకులు అచ్చమ్మకుంట రవి, ఎంపీటీసీ బ్రహ్మయ్య, ఆర్.బ్రహ్మయ్య నాయక్, సర్పంచులు కేతావత్ శ్రీను, రమావత్ మంత్రునాయక్, ఒంగోలు సైదా నాయక్, కొర్రా అంజినాయక్, బాణావత్ లచ్చు నాయక్, చిన్న శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.